
జగన్ సర్కారు పోయి...బాబు ప్రభుత్వం వచ్చినా...

# విద్యుత్ షాకులు




ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ కమిటీ

* ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి.
* స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలి.
* సెకి ఒప్పందం రద్దు చేయాలి.
* టైమ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలి.

## జగన్ సర్కారు పోయి...బాబు ప్రభుత్వం వచ్చినా...

# విద్యుత్ షాకులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రపంచబ్యాంకు ప్రయోగశాలగా మారుతోందన్నది 1990వ దశకం నాటి మాట. ఆనాడు సాగునీరు, విద్యుత్, విద్య, వైద్య, సహకార తదితర రంగాల్లో చేపట్టారు. ఆస్పత్రుల్లో ఒపి చీటికి ఐదు రూపాయలు, టెస్టులకు యూజర్ చార్జీలు, సాగునీటికి మీటర్లు... ఇలాంటివన్నీ చాలామందికి గుర్తుండే వుంటాయి. అయితే, వాటన్నిటిలో విద్యుత్ సంస్కరణలు ప్రధానమైనవి. ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు విద్యుత్ బోర్డును జనరేషన్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ అనే మూడు ముక్కలు చేసి వాటిని తమకు నచ్చినట్టు ఆడించడానికి ఒక రెగ్యులేటరీ కమిషన్‌ను (ఈఆర్‌సి) ఏర్పాటు చేస్తూ చట్టం తీసుకొచ్చారు. ఆ తరువాత విద్యుత్ చార్జీల పెంపు వాత పెట్టారు. భరించలేని ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యావత్తూ ఒకే సమస్యపై ఉద్యమించిన చారిత్రాత్మక సందర్భమది. ప్రజలపై ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించించింది. 2000 ఆగస్టు 28న హైదరాబాద్ నగర నడిబొడ్డున బషీర్‌బాగ్ లో పోలీసు కాల్పుల్లో ముగ్గురు యువకుల బలిదానం తెలుగు ప్రజల స్మృతి పథంలో ఎన్నటికీ నిలిచి వుంటుంది. ప్రజలకు దూరమైన ప్రభుత్వం ఆ తరువాతి ఎన్నికల్లో మట్టి కరిచింది. కానీ విద్యుత్ రంగంలో ప్రపంచబ్యాంకు విధానాలు - అంటే సంస్కరణలు మాత్రం రకరకాల పేర్లతో కొనసాగుతూనే వున్నాయి. అప్పు కావాలంటే మా షరతులు అమలు చేయండి అని ప్రపంచ బ్యాంకు గతంలో చెప్పినట్టే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుండి గ్రాంటు లేదా వాటా రావాలంటే వీటిని పాటించాల్సిందేనంటూ నీతి ఆయోగ్ ద్వారా ఉత్తర్వులిస్తున్నారు. లేదా మీ రాష్ట్రానికి రుణ పరిమితి అయిపోయింది, కొత్త అప్పు తీసుకోవాలంటే ఈ షరతులు అమలు చేయాల్సిందేనని కేంద్ర ఆర్థిక శాఖ నుండి రాష్ట్ర ప్రభుత్వాలకు తాఖీదులు పంపుతారు. లేకపోతే ఫలానా సంస్కరణలు అమలు చేస్తేనే ఆ పథకంలో రాయితీలు లభిస్తాయని ఊరిస్తారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కేంద్ర విద్యుత్ చట్టానికి సవరణల ద్వారా ప్రమాదకర సంస్కరణలకు, విద్యుత్ రంగ ప్రయివేటీకరణకు శతవిధాల ప్రయత్నిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వాలను ఒత్తిడి చేస్తున్నది. ఇలా సామ, భేద, దాన, దండోపాయాల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల చెవులు

మెలేస్తోంది. విభజిత ఆంధ్రప్రదేశ్ లో ఏర్పడిన ప్రభుత్వాలు కేంద్ర బిజెపి తో భాగస్వామిగా ఉండడం లేదా అంటకాగడం జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా విద్యుత్ సంస్కరణలు నిరాటంకంగా అమలవుతున్నాయి. ప్రజలపై భారాలు అంతకంతకూ పెరుగుతూనే వున్నాయి. విద్యుత్ పంపిణీ సంస్థలను కూడా ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టడానికి కుట్రలు పన్నుతున్నారు.

## ప్రతిపక్షంలో ఉండగా టిడిపి

టిడిపి, జనసేన, బిజెపి కూటమి మేనిఫెస్టోలో 'విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం' అన్న శీర్షికలో 'విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం' అని హామీనిచ్చారు. చంద్రబాబు నాయుడు ఉపన్యసించిన భారీ ఎన్నికల సభల్లో ఇదే విషయం గట్టిగా చెప్పారు. వైసిపి ప్రభుత్వం పాలన ఐదేళ్లలో రకరకాల పేర్లతో వేసిన రూ. 32,166 కోట్ల భారం తో బాధ పడుతున్న రాష్ట్ర ప్రజలు చంద్రబాబు మాటతో ఊరట చెందారు. రానున్న ఐదేళ్లూ కరెంటు చార్జీలు పెరగబోవని భావించారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చెప్పిందల్లా చేసిన వైసిపి సర్కారు వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్లు బిగించింది. రైతులు వ్యతిరేకించగా రాత్రి పూట ఎవరికీ



తెలియకుండా దొంగచాటున పొలాల్లోని పంప్‌సెట్లకు మీటర్లు బిగించారు. అన్నదాతలు ఆగ్రహించిన నేపథ్యంలో నాటి యువగళం పాదయాత్ర సందర్భంగా 2023 జులై 2వ తేదిన (144వ రోజున) నెల్లూరులో స్మార్ట్‌మీటర్లను పగలగొట్టాలని నారా లోకేష్ పిలుపునిచ్చారు. పుండుపై కారం చల్లినట్లు వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని చెప్పారు. అధికారులు వచ్చి సంతకం చేయమంటే చెయ్యొద్దన్నారు. రైతులకు అండగా టిడిపి నిలబడుతుందన్నారు. అప్పటికే పోరాడుతున్న రైతాంగం రెట్టించిన బలంతో మీటర్ల ఏర్పాటును ప్రతిఘటించడంతో నాటి సర్కారు వెనక్కు తగ్గింది.

మోడీ ప్రభుత్వం తెచ్చిన రీ వ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీం (ఆర్‌డిఎస్‌ఎస్)లో భాగంగా వైఎస్ జగన్ సర్కారు విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు బిగించడానికి నిర్ణయించింది. ఆ టెండర్లు కూడా షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్‌కు ఖరారు చేసింది. భారీగా ప్రజా ధనం దుర్వినియోగం జరుగుతుందని, స్మార్ట్ మీటర్లు వద్దంటూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అనేక సందర్భాల్లో మీడియా ముఖంగా చెప్పారు. హైకోర్టులో కేసు కూడా వేశారు.

అదానీ – సెకి సోలార్ విద్యుత్ ఒప్పందంపై వైసిపి ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తున్నదని ప్రతిపక్షంలో ఉండగా నేటి ఆర్థిక శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ విమర్శించారు. యూనిట్ విద్యుత్ రూ.1.99లకే వస్తుంటే వైసిపి ప్రభుత్వం రూ.2.49లకు ఒప్పందం కుదుర్చుకుందని 2021 నవంబం 6వ తేదిన విలేకరుల సమావేశంలో చెప్పారు. ఇదే అంశంపై అప్పటి ఇంధన శాఖ కార్యదర్శి ఎన్ శ్రీకాంత్‌కు నవంబర్ 16న లేఖ రాశారు. సెకి ఒప్పందం వినియోగదారులకు భారమని పేర్కొంటూ ఆ ఒప్పందం వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.. సెకి ఒప్పందంపై 04.05.2022న హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు.

ప్రతిపక్షంలో ఉండగా విద్యుత్ రంగానికి సంబంధించిన కొన్ని కీలక అంశాలపై తెలుగుదేశం పార్టీ అనుసరించిన వైఖరి అది. టిడిపి కూటమి అధికారానికి వస్తూనే ఏడు శ్వేత పత్రాలను విడుదల చేసింది. వాటిలో విద్యుత్ రంగం చాలా ముఖ్యమైనది. అందులో వైసిపి పాలనలో ప్రజలపై పడిన విద్యుత్ భారాలను వివరించారు కానీ కేంద్ర ప్రభుత్వం విధించిన షరతుల గురించి ఒక్క ముక్క కూడా లేదు. విద్యుత్ రంగంలో ఐదేళ్ల కాలంలో రూ.32,166 కోట్ల భారం వేశారనీ మరో 17,137 కోట్ల ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీల భారం (ఎఫ్‌పిపిసిఎ) కూడా ఉందని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ సంస్థలు మొత్తంగా 1.20 లక్షల కోట్ల నష్టాల్లో కూరుకుపోయాయని

వివరించారు. మిగిలిన అన్ని శ్వేత పత్రాల మాదిరిగానే గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసిన తీరుపై విమర్శలు గుప్పించారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం విద్యుత్ వినియోగదారులను ఆదుకొనే చర్యలు తీసుకోలేదు సరికదా, గత సర్కారు బాటలోనే వడివడిగా భారాలు వేయడం గమనార్హం. ఇంకా చెప్పాలంటే కొన్ని అంశాల్లో అంతకంటె తీవ్రంగా వ్యవహరిస్తోంది.


టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సార్లు సర్దుబాటు చార్జీల భారం మోపింది. ఇది అందరు వినియోగదారులపైనా భారమే. నిరుపేదలు మొదలు ఆగర్భ శ్రీమంతుల వరకూ అందరికీ ఒకే విధమైన చార్జీ విధించడమంటే పేదలకు, సామాన్యులకు అది పెనుభారమే అవుతుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.6,072.86కోట్ల సర్దుబాటు ఛార్జీల భారం మోపుతూ 25.10.2024న నియంత్రణా మండలి (ఎపిఇఆర్‌సి) ఉత్తర్వులు ఇచ్చింది. 2024 నవంబర్ నుంచి మొదలుపెట్టి 2026 జనవరి వరకు వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. యూనిట్‌కు నెలకు కనిష్టంగా 0.20 పైసల నుండి 0.83 పైసల వరకు భారం వేశారు. అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.9,412 కోట్ల సర్దుబాటు చార్జీల భారం మోపుతూ 29.11.2024వ తేదిన నియంత్రణా మండలి ఉత్తర్వులు విడుదల చేసింది. 2024 డిసెంబర్ నుంచి 2026 నవంబర్ వరకూ వసూలు చేస్తున్నారు. ఇదికాకుండా ప్రతి నెలా యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు.

ఈ రెండు విడతలు కలిపితే ప్రజలపై రూ. 15,485 కోట్ల భారం వేశారు. ఇది టిడిపి కూటమి వేసిన భారం కాక మరేమిటి? ప్రతి యూనిట్‌కు నెలకు 1.46 నుండి 1.65 అదనంగా చెల్లించవలసి వస్తోంది. నెలకు 30 యూనిట్లు, అంతకన్నా తక్కువ వాడే గృహ వినియోగదారు సాధారణ చార్జీ యూనిట్‌కు రూ.1.90 కాగా, అన్ని విడతల సర్దుబాటు చార్జీలు రూ.2.75 వరకు అదనంగా చెల్లిస్తున్నారు. 2024-25 సంవత్సరం సంబందించి సర్దుబాటు ఛార్జీల అదనపు భారం ప్రతిపాదనలు కూడా సిద్ధమవుతున్నాయి. అసలు కన్నా కొసరు ఎక్కువ అంటే ఇదేనేమో! అంతకన్నా చిత్రమేమంటే గతంలో ఎప్పుడు ట్రూఅప్ చార్జీలు లేదా సర్దుబాటు చార్జీలు ప్రతిపాదించినా ప్రజల నుండి అభిప్రాయాలను ఆహ్వానించి నియంత్రణా మండలి బహిరంగ విచారణ జరిపేది. కానీ టిడిపి కూటమి పాలనలో ఆ సాంప్రదాయానికి

సైతం తూట్లు పొడిచి ఎలాంటి విచారణ లేకుండా ఏకపక్షంగా సర్దుబాటు అదనపు చార్జీలను ప్రకటించారు. అంటే సాధారణ ప్రజాస్వామ్య సూత్రాలకు కూడా తిలోదకాలిస్తున్నారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన విద్యుత్ నియంత్రణా మండలిని పాలకులు డమ్మీగా మార్చారు.

## అమెరికాలో అదానిపై కేసు – అయినా కిమ్మనని రాష్ట్ర ప్రభుత్వం

అదానీ గ్రూపు సంస్థలు ఉత్పత్తి చేసే సౌర విద్యుత్తును దేశంలోని వివిధ విద్యుత్ పంపిణీ సంస్థలు కొనుగోలు చేయడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు అదానీ గ్రూపు భారీగా ముడుపులు చెల్లించిందని అమెరికా కోర్టులో కేసు నమోదు కావడం పెను సంచలనం కలిగించింది. ముడుపుల మొత్తం రూ. 2,029 కోట్లు కాగా అందులో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలకు రూ.1,750 కోట్లు ముట్టజెప్పారన్నది ప్రధాన అభియోగం. ఒప్పందాలు రాష్ట్ర ప్రభుత్వాలతో జరిగాయి కనుక మాకేం సంబంధం లేదని మోడీ మహాశయులు బుకాయించే యత్నం చేశారు. కానీ అదానీ ఒప్పందం చేసుకున్నది సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) తో కనుక కేంద్రమే ఇందుకు సూత్రధారి అన్నది ముమ్మాటికీ నిజం. తమ అనుంగు మిత్రుడు గౌతమ్ అదానీని కాపాడడానికి



ప్రధాని మోడీ ఇటీవలి అమెరికా పర్యటనలో సైతం వెంపర్లాడిన సంగతి లోకానికి తెలిసిందే!

మేము కేంద్ర ప్రభుత్వ సంస్థయైన సెకి తో ఒప్పందం చేసుకున్నాం తప్ప అదానీతో కాదన్న మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట కూడా వాస్తవ విరుద్ధమైనదే. రాష్ట్ర ప్రభుత్వ రంగంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంల) సిఎండిలు చేసుకున్న ఒప్పందంలో విద్యుత్ సరఫరా అదానీ గ్రీన్ నుండి జరుగుతుందనీ, కమిషన్‌గా సెకి కి యూనిట్‌కు ఏడు పైసలు చెల్లిస్తామనీ సంతకాలు చేశారు కాబట్టి ఒప్పందం అదానీతో కాదంటూ వైసిపి బుకాయించడం కుదరదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సౌర విద్యుత్ ఒప్పందమేగాక అదానీకి అనేక రూపాల్లో ఈ రాష్ట్ర సంపదను హారతి పళ్లెంలో పెట్టి అప్పగించిన మాట వాస్తవం కాదా? ఇటు కృష్ణపట్నం మొదలు అటు కొత్తగా నిర్మిస్తామంటున్న శ్రీకాకుళం జిల్లా మూలపేట వరకు పోర్టులను అదానికి అప్పగించింది వైసిపి పాలనలోనే! ఐదు జిల్లాల్లో 6,200 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి పవర్ ప్రాజెక్టులను ఎలాంటి టెండర్లూ లేకుండానే అదాని కి కట్టబెట్టారు. అంతకుమించి ఏజెన్సీ (ఐదవ షెడ్యూల్ ప్రాంతం)లో రాజ్యాంగాన్ని, పీసా చట్టాన్ని సైతం ఉల్లంఘించి అదానీకి ఇచ్చేశారు కదా! ఇన్ని చేసి మళ్లీ బుకాయింపులకు దిగినా జనాన్ని నమ్మించలేరు.

ప్రతిపక్షంలో ఉండగా సెకి ఒప్పందంపై విమర్శలు చేసిన టిడిపి నాయకులు అసలు కుంభకోణంపై అమెరికాలో సైతం చర్చ జరుగుతున్న సమయంలో నోరెత్తలేదు. ఒప్పందంలో రూ.2029 కోట్ల అవినీతి ఉందని, అందులో రూ.1757 కోట్లు జగన్‌కు అందినట్లు అమెరికా న్యాయవిభాగం తేల్చిన నేపథ్యంలో ఒప్పందంలో ఏముందో వివరించే పత్రాలను బయటపెట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. రూ.1.99 పైసలకు వచ్చే విద్యుత్‌ను రూ.2.49 పైసలకు గత ప్రభుత్వం ఎందుకు కొన్నదో బయటపెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయలేదు కనుక ఈ విషయంలో జగన్‌మోహన్‌రెడ్డిని సమర్థించినట్లే ప్రజలు భావిస్తున్నారు. చంద్రబాబు, జగన్ విధానాలు ఒక్కటేననీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు తిరిగి వచ్చారు తప్ప, రాష్ట్రంలో విధానాలు మారలేదని ఎవరైనా అంటే కాదనగలరా? పాత విధానాలే అమలవుతున్నాయని, అదానీతో జగన్ చేసుకున్న ఒప్పందాలను చంద్రబాబు కొనసాగిస్తున్నారని జనం భావించక తప్పదు. అలాగే, మోడీ, జగన్ ఇద్దరూ మంచి స్నేహితులు కనుక కేంద్రంలోనూ దీనిపై చర్చ లేదు. కేంద్రంలో భాగస్వామిగా

ఉన్న టిడిపి కూడా అప్పుడు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ కుంభకోణం గురించి కానీ అదాని పేరు కానీ ప్రస్తావించేందుకు కూడా సాహసించ లేదు. అయితే, మొదట్లో ఈ విషయంలో ఎలా ముందుకెళ్లాలన్నది 'పరిశీలిస్తున్నాం' అని చెప్పిన ముఖ్యమంత్రి కొన్నాళ్ల తరువాత ఒప్పందం రద్దు చేస్తే నష్ట పరిహారం చెల్లించవలసివస్తుందని పొంతన లేని సమాధానాలు చెప్పారు.

సెకి తో డిస్కంలు ఒప్పందం చేసుకోవడాన్ని తొలి నుండీ సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు వ్యతిరేకించాయి. రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఎదుట పబ్లిక్ హియరింగ్‌లలో ఆయా సందర్భాల్లో లేవనెత్తారు. అయితే, మండలి యథావిధిగా బుల్డోజ్ చేసింది.


సోలార్ విద్యుత్ యూనిట్ రు.1.99 కి టెండర్లు పడిన రోజుల్లో సెకితో రు.2.49 కి కొంటామని ఒప్పందం చేసుకున్నారు. దానికి తోడు అంతర్రాష్ట్ర రవాణా (ఐఎస్‌టిఎస్) చార్జీల పేరిట యూనిట్‌కు రు.1.70 అదనం. 25 ఏళ్లపాటు రాష్ట్ర ప్రజలు లక్ష కోట్ల రూపాయలు చెల్లించాల్సి వుంటుంది. ఇది మోయలేని భారమే! రాష్ట్రంలో ఇటీవల తీసుకొచ్చిన ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు కూడా అదానీ కంపెనీవే! ఇప్పుడున్న మీటర్లు కచ్చితంగా పని చేస్తున్నాగాని మీటర్ మార్చాల్సిందే! దాని విలువను ఏడు నుండి తొమ్మిదేళ్లలో నెలనెలా వినియోగదారులే చెల్లించాలి. మోడీ సర్కారు పెట్టిన షరతు– మొత్తం రాష్ట్ర డిస్కంలు వినియోగించే పునరుత్పాదక ఇంధన విద్యుత్ (రెన్యువబుల్ ఎనర్జీ) కనీసం 20 శాతం వుండాలని, 2026–27 నాటికి 22 శాతానికి పెంచాలన్న ఆర్‌పిపిఓ పర్యవసానంగా రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు ఖచ్చితంగా సౌర, పవన విద్యుదుత్పత్తి చేయాలనే వినియోగించాలనే (మస్ట్ రన్) కేటగిరీ కింద సెకీతో ఒప్పందాలు చేసుకున్నాయి. రాష్ట్రప్రభుత్వం జెన్‌కో ఆధ్వర్యంలో వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి నెలకొల్పిన థర్మల్ ప్లాంట్ల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోకుండా, ప్రైవేటు కంపెనీల సోలార్ తప్పనిసరిగా వినియోగించుకోవలసిన కేటగిరీ కింద ఒప్పందం చేసుకోవడం ప్రభుత్వ రంగాన్ని దెబ్బతీయడానికే! ఈ ఒప్పందాల పర్యవసానంగా విద్యుత్ కొనుగోలు ఖర్చు పెరిగింది. గతం నుండి చేసుకున్న అక్రమ ఒప్పందాలు (పిపిఎ), స్వల్పకాలిక కొనుగోళ్ళ పేరుతో అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు, పాలకుల అవినీతి, దుబారా, బొగ్గు కొనుగోళ్ళలో కార్పొరేట్ కంపెనీల దోపిడీ తదితర కారణాలతో విద్యుత్ వ్యయం పెరుగుతున్నది. ఇలాంటి నిర్ణయాలమూలంగానే సర్దుబాటు ఛార్జీల భారం జనంపై పడుతోంది.

అమెరికా కోర్టులో కేసు నమోదైన వెంటనే కెన్యా ప్రభుత్వం అదానీ గ్రూపుతో చేసుకున్న ఎయిర్‌పోర్ట్ ఒప్పందాన్ని రద్దు చేసింది. శ్రీలంక ప్రభుత్వం అదానీ గ్రూపుతో ఒప్పందాలను పక్కనబెట్టింది. బంగ్లాదేశ్ సర్కారు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను రద్దు చేసింది. అదే విధంగా మన రాష్ట్రంలో అదానీ గ్రూపుతో చేసుకున్న విద్యుత్, పోర్టులు, డేటా సెంటర్ తదితర ఒప్పందాలన్నిటినీ ప్రభుత్వం రద్దు చేయాల్సిందే!

## స్మార్ట్ మీటర్లతో కొత్త భారం

అన్ని రంగాల విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లను బిగించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలు సిద్ధమయ్యాయి. రాష్ట్రంలో 1.90కోట్ల మంది విద్యుత్ వినియోగదారులున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, పరిశ్రమ, వాణిజ్య వినియోగదారులకు ప్రీ పెయిడ్ మీటర్లను బిగిస్తున్నారు. త్వరలోనే 200 యూనిట్లు దాటిన గృహ వినియోగదారులకు కూడా ఈ మీటర్లను అమర్చనున్నారు. ఒక్కో మీటర్ ధర రూ.10,205గా నిర్ణయించారు.దానికి అవసరమైన ఇతర పరికరాల ఖర్చు అదనం. ఇందులో మొదటి దశలో సుమారు 56 లక్షల మీటర్లను అదానీ కంపెనీ బిగించనుంది.

వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను ప్రయోగాత్మకంగా శ్రీకాకుళం జిల్లాలో బిగించారు. ఆ అనుభవాన్ని అధ్యయనం చేసేందుకు ప్రయాస్ ఎనర్జీ గ్రూపునకు



ప్రభుత్వం బాధ్యత అప్పగించింది. విద్యుత్ ఆదా అయినట్టు ఎలాంటి నిర్ధారణ రాలేదు. ప్రయాస్ ఎనర్జీ గ్రూప్ నివేదికను గత ప్రభుత్వం వెల్లడించనేలేదు. పోనీ ఈ ప్రభుత్వమైనా బయటపెడుతుందా అంటే అదీ లేదు. ఆ నివేదిక అధికారికంగా వెల్లడైతే వ్యవసాయ పంప్‌సెట్లకు మీటర్ల బండారం బయటపడుతుంది. రెండు ప్రభుత్వాలూ ఆ నివేదికను దాచిపెట్టి ఉంచాయి. మరి తేడా ఏమిటి?

శ్రీకాకుళం అనుభవం ఏమిటో నిర్ధారించకుండానే యావత్ రాష్ట్రంలోనూ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తామని ప్రభుత్వం చెప్పింది. తాజాగా 200 యూనిట్లు పైన వినియోగించే అన్ని కనెక్షన్‌లకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. అందుకయ్యే ఖర్చు వ్యవసాయం తప్ప మిగతా రంగాల వినియోగదారుల నుండే వసూలు చేస్తామని చెప్పారు. వినియోగదారులపై తీవ్ర ప్రభావం చూపించే ఇటువంటి అంశాలను ఎపిఇఆరిసి దృష్టికి తెచ్చి, అందుపై బహిరంగ విచారణ జరిపిన తరువాత అటువంటి ఏర్పాట్లు చేయాలి తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా వెళ్లడం తగదు. వినియోగదారులు ఇప్పటికే అధునాతనమైన ఐఆర్‌డిఎ మీటర్లకు డబ్బు చెల్లించి ఏర్పాటు చేసుకున్నారు. అలాంటిదీ వాటిని తొలగించి, స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు వేల రూపాయలు పోసి కొనుక్కోవలసిన అవసరం సాధారణ గృహ వినియోగదారులకేముంది? సమాధానం చెప్పాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే కదా! కేవలం స్మార్ట్ మీటర్ల తయారీ పరిశ్రమలకు, సాఫ్ట్‌వేర్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేందుకు ఇటు వినియోగదారుల సొమ్ము కానీ అటు సర్కారు ఖజానా నుండి కానీ ఎందుకు చెల్లించాలి? ఇలా ప్రజలు ప్రశ్నిస్తున్నారనే ఇటీవల నియంత్రణా మండలి ద్వారా స్మార్ట్ మీటర్లపై కొత్తగా రెగ్యులేషన్ తీసుకొచ్చారు.




## విద్యుత్ సుంకం పెంపు

యూనిట్‌కు ఆరు పైసలుగా ఉన్న విద్యుత్ సుంకాన్ని 2021లో అప్పటి వైసిపి ప్రభుత్వం రూపాయికి పెంచింది. సుంకం పెంపునకు

వ్యతిరేకంగా కొన్ని సంస్థలు కోర్టును ఆశ్రయించగా స్టే మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టులో ఎలాంటి అవాంతరాలు రాకుండా 2024 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎపి విద్యుత్ సుంకం – 1939 చట్టానికి టిడిపి కూటమి ప్రభుత్వం సవరణ తీసుకొచ్చింది. విద్యుత్ సుంకం పెంపును చట్టబద్ధం చేసింది. అంటే వైఎస్ జగన్ ప్రభుత్వం వేసిన భారాన్ని చంద్రబాబు ప్రభుత్వం మరింత గట్టిబరిచిందన్నమాట. మరి టిడిపి – వైసిపి మధ్య తేడా ఏమిటి?


## షిరిడీ సాయి, యాక్సిస్ పవర్

వైసిపి ప్రభుత్వ పాలనలో సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మొదలు కొత్త కండక్టర్ల (వైర్) వరకూ అన్ని కాంట్రాక్టులూ షిరిడీ సాయి పవర్‌కే దక్కేవి. కొన్ని పనులు టెండర్లు సైతం లేకుండానే! అస్మదీయ కంపెనీ కనుక వైసిపి పెద్దలు అలా చేయిస్తున్నారని మీడియాలో అనేక కథనాలు వచ్చాయి. అయితే ప్రభుత్వం మారాక కూడా వారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండానే అన్నీ 'జరిగిపోతున్నాయి'. ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం. షిరిడీ సాయి సంస్థ నుండి ఎన్నికల బాండ్ల మొత్తాలు టిడిపి ఖాతాలో కూడా రూ.40 కోట్లు జమయ్యాయి. ఇదీ అసలు విషయం! హిందూజా సంస్థకు విద్యుత్ ఉత్పత్తి చేయకపోయినా అప్పు తెచ్చి మరీ జగన్ సర్కార్ 1200 కోట్ల రూపాయలను అక్రమంగా చెల్లించింది. కూటమి సర్కార్ దీనిపై నోరు మెదపడం లేదు.

ఇక మరో విద్యుత్ సంస్థ యాక్సిస్ పవర్ ది మరో కథ. ఆ సంస్థ నుండి యూనిట్ రూ.3.30కు కొనుగోలు చేయాలని 2022లో డిస్కంలు ప్రతిపాదించాయి. అప్పటి నుండి ఈ విషయమై అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు కోర్టులకూ వెళ్లి వివాదాన్ని కొనసాగించింది. ఇక టిడిపి కూటమి ప్రభుత్వం రాగానే ఇక్కడ పావులు కదిపింది. ఇంకేముంది! సౌర విద్యుత్ చౌకగా లభిస్తున్న ఈ రోజుల్లో కూడా యూనిట్ రూ.4.28కి కొంటామని డిస్కంలు ప్రతిపాదించాయి.

## క్లీన్ ఎనర్జీ పాలసీ

రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ పవర్ పేరిట భారీ వ్యూహాలు రచిస్తూ ప్రచారం గావిస్తోంది. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ (2024) ని రూపొందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఆగస్టులో గుజరాత్‌లో జరిగిన గ్లోబల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ లో పాల్గని ముఖ్య ప్రసంగం చేశారు. రానున్న ఐదేళ్ళలో రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం



చెబుతోంది. ఇందుకు 40 గి.వా. సౌర, 20 గి.వా. పవన, 12 గి.వా. పంప్డ్ స్టోరేజీతోపాటు 25 గి.వా. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి ప్లాంట్లు ఏర్పాటు చేస్తామంటోంది. ఒక మిలియన్ మెట్రిక్ టన్నుల కెపాసిటీ గ్రీన్ హైడ్రోజన్, 2,500 కిలోమీటర్ల ఇథనాల్ ప్లాంట్లు వస్తాయంటోంది. ఇంత భారీ విస్తరణ చేపట్టడానికి విద్యుత్ డిమాండ్ అంటే రాష్ట్రం అవసరాలు, అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న అవకాశాలతోపాటు సర్కారు ఖజానాకు, భూమి, నీరువంటి ప్రజా సంపదకు ముప్పు కలుగుతుంది.

ఎపిఈఆర్‌సి లెక్క ప్రకారం 2022-23లో వాస్తవ వినియోగం 72,400 మిలియన్ యూనిట్లు (ఎం.యు) కాగా అది 2030 నాటికి 1,15,067 ఎం.యు.కి పెరుగుతుందని క్లీన్ ఎనర్జీ పాలసీలో సర్కారు చెబుతోంది. అంటే ఏడేళ్లలో సుమారు 60 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే విద్యుత్ వినియోగం అంత పెద్దఎత్తున పెరగడం సాధ్యమా? విద్యుత్ డిమాండ్‌ను భారీగా చూపించడం గతం నుండీ పాలకులకు వెన్నతో పెట్టిన విద్యగా ఉంది. అది అలా అలవాటుగా మారి ఏటా డిస్కంలు ఎపిఇఆర్‌సి కి సమర్పించే ఎఆర్‌ఆర్ లలోనూ అధికంగా చూపడం, వాటిని కమిషన్ వారు తగ్గించడం అందరూ ఎరిగిందే! బ్యాటరీ ఎనర్జీ స్టోర్ విద్యుత్ చాలా ఖరీదు అవుతుంది. అలాగే గ్రీన్ హైడ్రోజన్‌తో కూడా సమస్యలున్నాయి. సోలార్, విండ్ పవర్‌కు భారీగా ఎవాక్యుయేషన్ లైన్స్, ట్రాన్స్‌మిషన్ ఏర్పాట్లు అవసరం అవుతాయి. వీటన్నింటినీ ప్రభుత్వం ఖర్చుతో పెట్టడమేగాక వీలింగ్ ఛార్జీలలోనూ కంపెనీలకు రాయితీలిస్తానంటోంది. మొత్తం పునరుత్పాదక విద్యుత్ (ఆర్.ఇ.) రంగంలో ఇప్పటి వరకు విదేశీ కార్పొరేట్లు (ప్రధానంగా

యూరప్ ఖండం కార్పొరేట్లు) రాగా ఇటీవల అదాని, టాటా, రిలయన్స్ గ్రూపులు పెద్ద ఎత్తున చేపడుతున్నాయి. మన రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల పేరుతో అదాని గ్రూపు షెడ్యూల్డు ప్రాంతంతో సహా ఎఎస్ఆర్ పాడేరు, అనకాపల్లి జిల్లాల్లో భూములు కొట్టేసింది. నదులపై, వాగులపై పెత్తనం చెలాయిస్తుంది. ప్లాంట్ల పేరిట భూములు పొందింది. నెల్లూరు జిల్లాలో రిలయన్స్ గ్రూపు కూడా భూములు స్వాధీనం చేసుకుంది. సోలార్ పార్కుల పేరుతో రైతులకు 30 వేలు సంవత్సరం లీజు అని భ్రమలు పెట్టి ఒప్పందాలు చేసుకొని భూములు స్వాధీనం చేసుకొని బడా కంపెనీలు




భారీగా లబ్ధి పొందుతున్నాయి. రానున్న రోజుల్లో మన భూమి, నీరు కార్పొరేట్లకు ధారాదత్తం చేయడం ఈ క్లీన్ ఎనర్జీ పాలసీ (2024) వెనకున్న కుట్రలా కనిపిస్తోంది.

## స్వల్పకాలిక కొనుగోళ్ల మాయాజాలం

విద్యుత్ డిమాండ్ కు తగినంతగా సరఫరా లేదంటూ పవర్ ఎక్స్ఛేంజిలో అధిక ధరకు విద్యుత్ కొంటారు. ఇది ముందస్తు ఒప్పందంతోనూ, ఒక రోజు, గంట, పదిహేను నిమిషాల ప్రకారం కూడా కొనే అవకాశం వుంది. అప్పటికప్పుడే డిమాండ్ ఎక్కువగా వుందనీ కనుక ధర పెరిగిపోయిందంటూ ఎక్స్ఛేంజిలో మహా

మోసం జరుగుతుంటుంది. 2010-11లో దేశంలో పవర్ ఎక్స్ఛేంజిలో 81.56 బిలియన్ యూనిట్ల అమ్మకం జరగ్గా 2023-24లో 218.22 బి.యూ. వ్యాపారం జరిగిందంటే ఎంతలా విస్తరించిందో అర్థం చేసుకోవచ్చు. స్వల్పకాలిక కొనుగోళ్లలో గోల్‌మాల్ ఎంత వుంటుందంటే 2022-23 ఎఫ్‌పిపిసిఎ చార్జీల్లో 6626 కోట్లు అందుకోసమేనని డిస్కంలు చెప్పాయి. ఇందులో 'అందరికీ' వాటాలుంటాయని విద్యుత్ రంగ నిపుణులు చెబుతారు.

## తాజా టారిఫ్ ఆర్డర్ వెనుక మతలబులు

విద్యుత్ చార్జీలు పెంచడం లేదంటూనే వినియోగదారుల జేబులకు కత్తెర వేసే టైమ్ ఆఫ్ డే టారిఫ్ విధానాన్ని చిరు వ్యాపారులకు సైతం అమలు చేస్తామని ప్రకటించడం దారుణం. తప్పనిసరిగా విద్యుత్‌ను వినియోగించాల్సిన సమయాల్లో చార్జీల మోత మోగిస్తారు. డిమాండ్‌ను బట్టి చార్జీలు విధించే ఈ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) అనుమతించడం దారుణం. విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసే రాష్ట్రాలకే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను, రాయితీలను ఇస్తామని తాజాగా బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొన్న విషయం అందరికీ తెలుసు.

వినియోగదారులు ఏ సమయంలో ఎంత విద్యుత్ వినియోగించారని తెలుసుకోవాలంటే స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్లు తప్పనిసరి కానున్నాయి. రాష్ట్రంలో వాటిని అమర్చే కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న అదానీ కంపెనీ 59,21,344 మీటర్లను బిగించనుంది. అదానీ స్మార్ట్ మీటర్ల కోసమే టైం ఆఫ్ డే టారీఫ్ విధానాన్ని అమలు చేస్తున్నారని విద్యుత్ నిపుణులు పేర్కొంటున్న విషయం ముమ్మాటికీ నిజం. టిఒడి విధానాన్ని అనుమతించొద్దని ఇఆర్‌సి నిర్వహించిన బహిరంగ విచారణలో సిపిఎంతో పాటు



ప్రజాసంఘాలు, పరిశ్రమలు కూడా డిమాండ్ చేశాయి. విద్యుత్ ఛార్జీలు పెంచబోవడం లేదని, గతంలో ఉన్న ఛార్జీలో ఎలాంటి మార్పు లేదని ఎపిఇఆర్‌సి ఇన్‌చార్జి చైర్మన్ చెప్పడం అర్ధ సత్యమే! కోవిడ్ అనంతరం వ్యాపారాలు పుంజుకోక, మరోవైపు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న చిరు వ్యాపారుల సంక్షే మానికి  ప్రభుత్వం రక్షణ చర్యలు చేపట్టడం మాని ఇలా కరెంటు చార్జీలు పెంచడం తగదు. మోసపూరిత కండిషన్లు పెట్టి విద్యుత్ వినియోగదార్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు అంటగట్టే కుట్ర ఇది. కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన ఆర్‌డిఎస్‌ఎస్ షరతులను టిడిపి కూటమి ప్రభుత్వం ఈ విధంగా అమలుకు పూనుకోవడం క్షమించరానిది. మోడీ ప్రభుత్వ షరతుల అమలు, మరోవైపున అదానివంటి కార్పొరేట్లకు స్మార్ట్ మీటర్ల ద్వారా లబ్ధి చేకూర్చడమే రాష్ట్ర ప్రభుత్వ విధానంగా ఉంది. గత వైసిపి ప్రభుత్వం బాటలోనే కూటమి కూడా పయనించడాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. అధికారం చేపట్టిన ఈ తొమ్మిది మాసాల్లో 15,450 కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం విధించింది. సాధారణ ప్రజలపై భారం పెరిగింది. వ్యాపారులు క్రుంగిపోతున్నారు. విద్యుత్ భారాలతో కొన్ని పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఉపాధి పోతోంది. అభివృద్ధి కుంటుపడుతున్నది. ఇప్పుడు టిఒడి పేరిట మరో రూపంలో చేసిన విద్యుత్ చార్జీల పెంపును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

వైసిపి ప్రభుత్వం పోయి టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారానికి వచ్చినా విద్యుత్ భారాలు తగ్గలేదు సరికదా ఇంకా పెరుగుతున్నాయి. టైమ్ ఆఫ్ డే లాంటి కొత్త వడ్డనలూ మొదలయ్యాయి. అందుకే...

*ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి.*

*స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలి.*

*సెకి ఒప్పందం రద్దు చేయాలి.*

*టైమ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలి... అంటూ ఉద్యమిద్దాం...*

**ప్రతులు : 25000**    **ప్రచురణ కాలం : మార్చి, 2025**    **వెల : రూ. 5/-**

166752

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

**27-30-9, గవర్నర్‌పేట, విజయవాడ - 2**

**ఫోన్ నెం. 0866-2577202**